క్లుప్తంగా

మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



అచ్యుతాపురంలో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీ అధికారులు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఈ పీహెచ్‌సీ పరిధిలోని అచ్యుతాపురం, వడ్లమూరు గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ గోపాలకృష్ణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పట్ల అవగాహనతో మెలగాలన్నారు. వ్యాధి లక్షణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రత నుంచి బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబీకులకు ఎన్నారై సాయం

కాజులూరు: మండలంలోని చేదువాడలో గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శనరావు కుటుంబీకులకు బందనపూడి సర్పంచ్ డేగల తిరుమల వేణి కుమారుడు, దుబాయ్‌లో ఉంటున్న ప్రవాస భారతీయుడు డేగల నాగేంద్ర రూ.20 వేల ఆర్థిక సహకారం అందజేశారు. సుమారు 28 సంవత్సరాలుగా పత్రికా రంగంలో పనిచేస్తున్న సుదర్శనరావు మరణవార్త తెలియగానే ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి మండల ప్రెస్ క్లబ్ సభ్యుల ద్వారా తక్షణ సహాయంగా రూ.20 వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

వల్లూరులో వాటర్ ట్యాంక్ నిర్మాణం



వల్లూరులో జరుగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు జగనన్న కాలనీలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. ట్యాంక్ నిర్మాణ పనులకు రూ.20 లక్షలు, పైప్‌లైన్ నిర్మాణ పనులకు రూ.8 లక్షలు మొత్తం 28 లక్షలను గత ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల ఆదేశాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కల్యాణి పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసిన వాటర్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్టు అధికారులు తెలిపారు.

విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కేసులు

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక శివారు రావిదొడ్డిపేటకు చెందిన కూరాటి వెంకటరమణ గత రెండు రోజులుగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలతో దూషించి కించపరిచే విధంగా మాట్లాడినందుకు మండల జనసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పామర్రు ఎస్సై ఎస్‌కే జానీబాషా బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో ప్రశాంత వాతావరణ చెడగొట్టే విధంగా కులాలు, మతాలు మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: కాజులూరు, కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్, మరామ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, శీల, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి విద్యుత్‌లైన్లలోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. అదే విధంగా మండలంలోని కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, పల్లిపాలెం, ఉప్పుమిల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపోతుందన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

నేడు మోగనున్న బడిగంట

- పాఠశాలల సన్నద్ధం
- మండపేట నియోజకవర్గంలో 165 ప్రభుత్వ పాఠశాలలు
- రామచంద్రపురం నియోజకవర్గంలో 241
- ఐదేళ్లలో వినూత్న అభివృద్ధి



మాచర పాఠశాలలో కొళాయిలను అమర్చుతున్న ప్లంబర్



టేకి పాఠశాలలో రన్నింగ్ వాటర్‌ను సరిచేస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: విద్యార్థుల వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి వారు నూతన విద్యా సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. అందుకనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు విశేషంగా మెరుగు పడ్డాయి. మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు 2024-25 విద్యా సంవత్సరానికి కావాల్సిన అవసరాలను సైతం తీర్చి అన్నింటినీ సిద్ధం చేసింది.

పాఠశాలలు సన్నద్ధం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలోని అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. తరగతి గదులను శుభ్రం చేయించారు. ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు మెరగుపరిచారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించమని ప్రచారం చేశారు.

మెరుగుపడిన ప్రభుత్వ విద్య

గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ఆసక్తి చూపారు. అమ్మఒడి పథకం అమలుతో శ్రామిక మహిళలు తమ పిల్లలను బడి మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన అనుభవం గత ప్రభుత్వంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు విద్యా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసింది. పాఠశాలలు తెరిచేనాటికి వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో మండలాలకు విద్యా కానుకలుగా స్కూల్ బ్యాగ్, షూ, యూనిఫాం, బెల్ట్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలను పంపిణీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం స్టూడెంట్ కిట్ పేరుతో పంపిణీ చేయనుంది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 1-8 తరగతులను ఇంగ్లిష్ మీడియంలోకి మార్చారు. తెలుగు, ఇంగ్లిష్ రెండు భాషల్లో ఉండేలా పాఠ్య పుస్తకాలను ముద్రించి ఈ తరగతుల విద్యార్థులకు పంపిణీ చేశారు. మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ఇప్పటికే పాఠశాలలకు చేర్చారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఎగ్, చిక్కీ, రాగిజావ, బెల్లం వంటివి గత ప్రభుత్వం పంపిణీ చేసింది. వాటిని నేటి విద్యా సంవత్సరంలో కూడా అమలు చేసేందుకు సిద్ధపడినట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

సుందరంగా పాఠశాలలు

గత ఐదేళ్లు అమలు చేసిన నాడు-నేడు పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దుకున్నాయి. పాఠశాలల్లో కనీస సదుపాయాలతో పాటు ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన చేసేందుకు పరికరాలను అమర్చారు. రామచంద్రపురం అర్బన్, రూరల్‌లో రూ.10.32 కోట్ల వ్యయంతో 65 పాఠశాలలను, కె.గంగవరం మండలంలో రూ.14.20 కోట్ల వ్యయంతో 49, కాజులూరు మండలంలో రూ.11.76 కోట్ల వ్యయంతో 72 పాఠశాలలను ఆధునీకరించారు. రెండో విడత నాడు - నేడు పనుల కోసం మండపేటలో 44 పాఠశాలలకు రూ. 10.95 కోట్లు, రాయవరం మడలంలో 21 పాఠశాలలకు రూ.7.41 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలోని 32 పాఠశాలలకు రూ.8.35 కోట్లు మంజూరు కాగా పాఠశాలలను మెరుగుపరిచారు.

రెండు నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలలిలా...

మండలం	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	మొత్తం
మండపేట పట్టణం	53	02	12	68
రాయవరం	33	05	08	46
కపిలేశ్వరపురం	37	06	08	51
ఆర్సీపురం పట్టణం	16	--	05	21
ఆర్సీపురం రూరల్	47	08	10	65
కె.గంగవరం	62	04	10	76
కాజులూరు	62	06	11	79
మొత్తం	310	31	64	406

'చంటిబాబు'కు ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శ

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని మాచవరం వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి (చంటిబాబు)ను ఎమ్మెల్సీ, ఆ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. ఈ నెల 4న చంటిబాబు తండ్రి గంగిరెడ్డి అకాల మరణం చెందిన విషయం పాఠకులకు విదితమే. చంటిబాబును, ఆయన సోదరుడు వీర్రాఘవరెడ్డిని ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. గంగిరెడ్డి చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులతో పాటుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి (చిన కాపు), ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి (చినరెడ్డి), గొలుగూరి సుబ్బారెడ్డి, కత్తుల అప్పారావు, తాడి సూర్యనారాయణరెడ్డి, గరగ సోమన్న తదితరులు చంటిబాబును పరామర్శించిన వారిలో ఉన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

తిలకించిన కూటమి అభిమానులు



మండపేట సూర్యా కన్వెన్షన్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న మహిళలు

మండపేట: బుధవారం నాటి చంద్రబాబు నాయుడి నూతన మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మండపేట ప్రజలు ప్రత్యక్షంగా తిలకించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. స్థానిక సూర్యా కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై పట్టణంలోని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులతో పాటు కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల కూటమి పార్టీల శ్రేణులు బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశామని కమిషనర్ బి.రాము తెలిపారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా మండపేట బస్టాండ్ వద్ద కూటమి పార్టీల శ్రేణులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ నాయకులు ఉంగరాల రాంబాబు, శిరంగు ఈశ్వరరావు, మల్లిపూడి గణేశ్వరరావు, కౌన్సిలర్లు కాసిన కాశీ విశ్వనాథ్, మాజీ కౌన్సిలర్లు వాసా రవికిరణ్, చుండ్రు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లు



కొడమంచిలి వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ఆర్టీసీ విద్యార్థులకు అందించే ఉచిత బస్ పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ ఆన్‌లైన్ ప్రక్రియ ఈ నెల 12 నుంచి ప్రారంభమైందన్నారు. గత ఏడాది విద్యా సంవత్సరంలో ఉచిత బస్‌పాస్‌లు 8,100 మందికి, స్టూడెంట్ రాయితీ బస్ పాస్‌లు సుమారు 18,000, మంత్లీ సీజన్ బస్‌పాస్‌లు 2,340, దివ్యాంగుల రాయితీ బస్ పాస్‌లు 1,250 మందికి ఇచ్చామన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో మరింత మందికి బస్ పాస్‌లు అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. 12 సంవత్సరాల లోపు అబ్బాయిలు, 18 సంవత్సరాల్లోపు పదో తరగతి వరకు చదివే అమ్మాయిలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుని అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సర్టిఫై చేయించుకుని వస్తే వెంటనే తమ బస్ పాస్ కౌంటర్‌లో బస్ పాస్‌లు జారీ చేస్తామన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో కొత్తపేట డీఎస్పీ



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కొత్తపేట డీఎస్పీ దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని కొత్తపేట డీఎస్పీ వెంకటరమణ దంపతులు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం డీఎస్పీ వెంకటరమణ దంపతులను ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు డీఎస్పీకి స్వామివారి విశిష్టతను వివరించారు.

ముగిసిన సువార్త సభలు

కొత్తపేట: ప్రవచన దేవుని సంఘం, యెరూషలెం చర్చ్ పాస్టర్, రీజినల్ ఓవర్‌సీర్ బిషప్ జి.అబెద్నగో - గ్రేస్ ఆధ్వర్యంలో మండలంలోని వాడపాలెం ఆనంద్ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు యేసుక్రీస్తు సువార్త సభలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ముగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ముఖ్య వర్తమానికులుగా బ్రదర్ జాన్‌వెస్లీ, సైలాస్ కె.శ్రీనివాస్, జోసఫ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవుల కోసం ప్రాణం ఇచ్చారని అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పెద్దలు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

అయినవిల్లి: మండలం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ మండల మహాసభ జరిగింది. సీఐటీయూ మండల కమిటీ సభ్యురాలు గుత్తుల వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ వర్కర్స్ సమస్యలను, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఇలా పలు డిమాండ్లు చేశారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఇసుకపట్ల మంగమ్మ, కోకన్వీనర్లుగా సుంకర నాగవేణి, గుత్తుల వెంకటలక్ష్మి, బూల ఉమామహేశ్వరి, ఈతకోట శ్రీనివాసరావు, రాయుడు శ్రీనివాసరావు, నేదునూరు లవరాజు, బండి లక్ష్మీదేవి మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది.

గ్రామాల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు



మంజేరులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న కూటమి కార్యకర్తలు, నాయకులు



హసన్‌బాదలో ప్రమాణ స్వీకారాన్ని వీక్షిస్తున్న సర్పంచ్ తదితరులు

కె.గంగవరం/రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాసంశెట్టి సుభాష్‌ను తొలిసారిగా గెలిచినా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన మంత్రివర్గంలోకి తీసుకోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కె.గంగవరం మండలంలోని అముజూరులో మండల టీడీపీ అధ్యక్షుడు చిన్ని కృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి, గ్రామ ఉప సర్పంచ్ ఈదల శ్రీనివాస్, నాయకులు ఎనుముల చిట్టిబాబు, నేమాని పట్టాభి, యాదగిరి తదితరుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. రామచంద్రపురం ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోను, మండలంలోని గ్రామ సచివాలయాల్లోను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో బుధవారం ఎన్డీఏ కూటమి కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పాటు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగానూ, స్థానిక ఎమ్మెల్యేగా గెలుపొందిన వాసంశెట్టి సుభాష్ క్యాబినెట్ మంత్రిగానూ విజయవాడలో ప్రమాణస్వీకారాలు చేయడంపై కార్యకర్తలు కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. గ్రామ పంచాయతీల ఆవరణలలో కార్యకర్తలు భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారాల ప్రత్యక్ష ప్రచారాలను ప్రదర్శించారు. పలు చోట్ల భారీ ఎత్తున బాణసంచా పేల్చారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

పప్పు దినుసులదీ అదే దారి



అంబాజీపేటలోని ఓ దుకాణంలో కూరగాయలు

అంబాజీపేట: కూరగాయల ధరలు ఆకాశాన్నంటి కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. బుధవారం అంబాజీపేటలోని వారపు సంతకు వచ్చి ఎన్నో రకాల కూరగాయలు తీసుకు వెళదామనుకున్న వినియోగదారులు వాటి ధరలు చూసి అవాక్కయ్యారు. దీంతో చేసేదేమి లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే ప్రజల గుండె గుభేలుమంటోంది. వాటి ధరలు ఒక్కసారిగి రెండింతలు పెరగడంతో ఏం కొనలేక పోతున్నామని వినియోగదారులు అల్లాడుతున్నారు. పప్పు దినుసులు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఎండాకాలం కారణంగా దిగుబడి లేదంటూ వ్యాపారులు అధిక ధరలకు పప్పు దినుసులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థిల కారణంగాద కూరగాయల, ఆకు కూరల దిగుబడి ఈ ఏడాది తగ్గిందని రైతులు అంటున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.40 పలికింది. బంగాళాదుంపలు కిలో రూ.40, పచ్చిమిర్చి రూ.80, టమాట కిలో రూ.70, ఒక ములక్కాడ రూ.10, బీరకాయలు కిలో రూ.60 పలుకుతున్నాయి. వీటితో పాటు దొండ, బెండకాయలు, క్యారెట్, వంకాయ ఇలా ప్రతి కూరగాయల ధర పెరిగిందని వినియోగదారులు చెబుతున్నారు.

నివాస ప్రాంతంలో సెల్ టవర్ నిర్మించవద్దు

అంబాజీపేట: ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో అక్రమ సెల్ టవర్‌ను ఎట్టి పరిస్థితుల్లో నిర్మించవద్దని వాకలగరువు గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. సెల్ టవర్ నిర్మించే ప్రాంతం వద్ద పనులను అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న చెరువుగట్టు ప్రాంతంలో సుమారు 200 మంది జనాభాతో 50 కుటుంబాల వారు నివసిస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇండస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడని, అందువల్లే సెల్ టవర్‌ను అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. నివాస ప్రాంతాల వద్ద సెల్ టవర్‌ను నిర్మించడం వల్ల దాని నుండి వెలువడే రేడియేషన్, కిరణాల వల్ల మానసిక రుగ్మతలు వస్తాయన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు వివిధ సమస్యలతో బాధపడాల్సి వస్తుందన్నారు. అందువల్ల సెల్‌టవర్ నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం వల్లే నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. పనులు నిలుపుదల చేయని పక్షంలో అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని గ్రామస్తులు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభం

కొత్తపేట: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. బీఏ (ఎకనామిక్స్), బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (మేథమెటిక్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పై కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్, జిమ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, అన్ని సౌకర్యాలతో, ఉన్నత ప్రమాణాలతో క్లాసులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లు కావలసిన విద్యార్థులు 2 పాస్ పోర్టు సైజు ఫొటోస్, ఆధార్ కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్స్ లిస్టు, టీసీ, స్టడీ, పదో తరగతి మార్క్స్ లిస్టు, ఒరిజినల్, ఫొటో స్టాట్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 9704302775, 9849711253లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

పశువులకు జోరుగా వ్యాక్సినేషన్

అంబాజీపేట: వర్షాకాలంలో వాతావరణ మార్పుల కారణంగా పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని మండల పశువైద్యాధికారి డి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్‌లను మాచవరం తదితర గ్రామాల్లో బుధవారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాక్సిన్ వేశామన్నారు. పశువులకు ప్రాణాపాయం లేకుండా రైతులు ముందు జాగ్రత్తగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. పశువైద్య శాఖ సిబ్బంది కూడా గ్రామాల్లోని పశువులను పరీక్షించి టీకాలు వేస్తున్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మునిపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఉప్పలగుప్తం: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సూచించారు. మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కోటిగట్టు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో ముంపునకు తావు లేకుండా, సాగునీరు ప్రవహించేలా కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పులసుగంటి సోమేష్, దోనిపాటి బాలయ్య, దోనిపాటి సత్యనారాయణ, కామిశెట్టి ఏసు ఉన్నారు.